పంట రుణమాఫీ.. మాయా!

- రేషన్ కార్డులో పేరు లేదని ఆగిన పంట రుణమాఫీ
- వేలాది మంది రైతులకు వర్తించని వైనం
- జిల్లాలో 12,173 మందికి 6519 మంది పెండింగ్
- అధికారులు, బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

మండలం	మొత్తం రైతులు	రైతుల అప్‌డేట్	పెండింగ్
అల్లాదుర్గం	462	258	204
చేగుంట	701	382	319
చిలిపిచెడ్	510	267	243
హవేళీఘనపూర్	481	262	219
కౌడిపల్లి	621	328	293
కొల్చారం	503	325	178
మనోహరాబాద్	197	109	88
మెదక్	1242	242	1000
నర్సాపూర్	897	322	575
నార్సింగి	298	180	118
నిజాంపేట్	446	243	203
పాపన్నపేట	1276	343	933
రామాయంపేట్	654	293	361
రేగోడ్	481	314	167
పెద్దశంకరంపేట	459	184	275
చిన్నశంకరంపేట	541	318	223
శివ్వంపేట	522	270	252
టేక్మాల్	622	409	213
తూప్రాన్	476	275	201
వెల్దుర్తి	784	330	454
మొత్తం	12,173	5654	6519

మెదక్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు రూ.2లక్షల పంట రుణాన్ని మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూలైలో మాఫీకి శ్రీకారం చుట్టడంతో రైతులంతా సంతోషం వ్యక్తంచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్గదర్శకాల పేరిట కాలయాపన చేయడం, అనంతరం ప్రకటించడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. మూడు విడతల్లో రుణమాఫీ చేస్తామని, 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు బ్యాంకుల్లో అసలు, వడ్డీ బకాయి జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల మేర పంట రుణాలు మాఫీ చేస్తామని పేర్కొన్నది. రేషన్ కార్డు, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం లబ్ధిదారులకు వర్తించేలా మార్గదర్శకాలు రూపొందించారు.

6519 మందికి పంట రుణమాఫీ బ్రేక్

పంట రుణమాఫీ విషయంలో ప్రామాణికతపై తీవ్ర గందరగోళం నెలకొన్నది. జిల్లాలో రైతుల వాస్తవ సంఖ్యకు రుణమాఫీ అయిన సంఖ్యకు రెట్టింపు వ్యత్యాసం ఉండడమే కారణం. అన్ని విధాలా అర్హులైనా తమకు ఇంతవరకు రుణమాఫీ కాలేదని పలువురు రైతులు వాపోతున్నారు. రేషన్ కార్డు లేదని జిల్లాలో 12,173 మంది రైతులకు పంట రుణమాఫీ కాలేదు. ఇందులో 5654 మందికి రేషన్ కార్డులో పేరు ఉండడంతో వారికి రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 6519 మందికి రుణమాఫీ పెండింగ్‌లో ఉన్నదని పేర్కొంటున్నారు. పలువురు రైతులు రూ.2 లక్షల లోపే రుణం తీసుకున్నా జాబితాల్లో పేరు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. రుణమాఫీ పోర్టల్‌లో పరిశీలించి, వివరాలు వెల్లడిస్తున్నా స్పష్టత రావడం లేదు. బ్యాంకర్లు రేషన్ కార్డు లేని వారికి రుణమాఫీ కాలేదని కరాఖండీగా చెబుతున్నారు. గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తు చేసుకుంటే అర్హులందరికీ మాఫీ అవుతుందని ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నా, రైతుల్లో నమ్మకం కలగడం లేదు. పంట రుణమాఫీ పథకం అమలు ప్రక్రియ అయోమయంగా ఉన్నదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా.. జమ కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నిజాంపేట పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు అక్షరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రామాయంపేట: హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో కాళోజీకి నివాళులు

తెలంగాణ కవులకు స్ఫూర్తి కాళోజీ

- యువత కాళోజీ అడుగు జాడల్లో కొనసాగాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా తెలంగాణ భాషదినోత్సవం

కలెక్టరేట్‌లో కాళోజీ జయంతిలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇతర అధికారులు

మెదక్, (నమస్తే తెలంగాణ)/మెదక్ మున్సిపాలిటీ/ మెదక్‌రూరల్/రామాయంపేట/నిజాంపేట/నర్సాపూర్/పాపన్నపేట, సెప్టెంబర్ 9 : తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ నారాయణ రావు చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కాళోజీ జయంతిని పురస్కరించుకుని ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కాళోజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుట్టిక నీది చావు నీది బతుకంతా దేశానిదంటూ.. ఓ సిరా చుక్కతో లక్షల మెదడులను మేల్కొల్పిన గొప్ప వ్యక్తి కాళోజీ అన్నారు. కాళోజీ అడుగుజాడల్లో నడవాలని కోరారు. కాళోజీ జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. తెలంగాణ ప్రాంతంలోని ఎంతో మంది కవులకు స్ఫూర్తినిచ్చిన దార్శనికుడు కాళోజీ నారాయణ రావు అని, తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేశారన్నారు. తన కవితలతో ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మహనీయుడిగా అభివర్ణించారు. దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్‌తో సన్మానింపబడిన ప్రజాకవి కాళోజీ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భాష, యాస వేళాకోళానికి గురైతే బాధపడి, ప్రత్యేక తెలంగాణను సమర్థించి పోరాడారన్నారు. కాళోజీ గొప్ప మానవతావాది, వైతాళికుడని, స్వచ్ఛమైన మనిషి అని కొనియాడారు. సమావేశంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, ముఖ్య ప్రణాళిక అధికారి మాన్య, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత, సెక్రటరీ సంతోష్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో తెలంగాణ భాషదినోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మెదక్ రూరల్: రాజ్‌పల్లి ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతిని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



మెదక్ మున్సిపాలిటీ: కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా వినాయకుడికి పూజలు

మెదక్ అర్బన్: వినాయకుడికి పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పెద్దశంకరంపేటలో గణనాథుడికి పూజలు చేస్తున్న దంపతులు

నర్సాపూర్‌లో గణేశుడి పూజల్లో మున్సిపల్ చైర్మన్, ముస్లిం, మైనార్టీలు

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 9: వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలన గణనాథుడికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పూజించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి నాగరాజు గౌడ్, ఏడీ మైన్స్ ప్రవీణ్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంలో ముస్లిం, మైనార్టీలు

నర్సాపూర్, సెప్టెంబర్ 9: మున్సిపాలిటీలోని ఒకటో వార్డు జగన్నాథరావు కాలనీలో గంధర్వ సేన యూత్, కాలనీలోని ముస్లిం, మైనార్టీలు సంయుక్తంగా వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పాఠశాల కిటికీలు, తలుపులు ధ్వంసం

ధ్వంసమైన పాఠశాల ఫ్లోరింగ్

నిజాంపేట, సెప్టెంబర్ 9: మండలంలోని వెంకటాపూర్(కె) ప్రాథమికోన్నత పాఠశాల కిటికీలు, తలుపులను దుండగులు ధ్వంసం చేశారు. పాఠశాలకు వరుసగా సెలువులు రావడంతో ఫ్లోరింగ్ బండలనూ ధ్వంసం చేసినట్లు హెచ్ఎం పరమేశ్ తెలిపారు. సోమవారం ఉదయం పాఠశాలకు రాగానే ధ్వంసమైన కిటికీ, తలుపులే దర్శనమిచ్చాయని, ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు తెలిపామన్నారు.

పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 9: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా నిత్యం అధికారులు పర్యవేక్షించి పనులు చేయించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. సోమవారం చిన్నశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అభివృద్ధి పనులను పకడ్బందీగా రికార్డులో నమోదు చేయాలని, నిధులు మంజూరై పనులు ప్రారంభమైన వాటిని పరిశీలించాలని సూచించారు. వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనం, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోని రహదారులు వెంట మొక్కలు నాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, దోమల మందును పిచికారీ చేయించాలన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్ ఉన్నారు.

పోషకాహారంపై దృష్టి సారించాలి

చిలిపిచెడ్‌లో..

చిన్నశంకరంపేటలో..

చిలిపిచెడ్, సెప్టెంబర్ 9: మండలంలోని ఫైజాబాద్ పంచాయతీలో గల శేరికుంట తండాలో అంగన్‌వాడీ టీచర్ ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా సోమవారంమహిళాలతో ప్రతిజ్ఞ చేయించి, పోషకాలపై సూపర్ వైజర్ సంతోషిమాత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 9: పిల్లలకు పోషకాలున్న ఆహార పదార్థాలు పెట్టాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్ రాణి సూచించారు. రుద్రారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 9: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

పండుగలు సంతోషంగా జరుపుకోవాలి

పండుగలు సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ తెలిపారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ద్వారకా గార్డెన్‌లో వినాయక చవితి మండపాల నిర్వాహకులకు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏదైనా సమస్య వస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు డయల్ 100కు

మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గాని, జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712657888లో సమాచారం అందించాలని వినాయక మండపాల ఆర్గనైజర్లకు సూచించారు.

ఇద్దరు నిందుతులకు రిమాండ్

తూప్రాన్/శివ్వంపేట, సెప్టెంబర్ 9: ఒకరిని దారుణంగా కొట్టి చంపిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను తూప్రాన్ డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తెలిపారు. ఈనెల 4న రాత్రి సమయంలో మండలంలోని గోమారం గ్రామానికి చెందిన గంగిరెడ్డి తిరుపతిరెడ్డి, పందిముక్కుల మణికంఠగౌడ్ ఇద్దరు ఒక వ్యక్తిని దొంగగా భావించి, ఇష్టం వచ్చినట్టు కొట్టి గాయపరిచారు. దీంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో సీసీ ఫుటేజ్ ఆధారంగా ఇద్దరిని అరెస్ట్ చేసి, విచారించారు. దీంతో నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ రంగకృష్ణ, శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి, తూప్రాన్ ఎస్ఐ శివానందం ఉన్నారు.

కోతుల బెడదతో పాఠశాల బంద్

ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

శివ్వంపేట, సెప్టెంబర్ 9: కోతుల బెడదతో పాఠశాలకు సెలవు ప్రకటించిన ఘటన మండలంలోని చండి గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. చండి గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఒక కోతి చనిపోయింది. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులను పాఠశాలలోనికి రానివ్వకుండా కోతులన్నీ వందల సంఖ్యలో విద్యార్థులను అడ్డుకున్నాయి. ఎంతకీ కోతులు ఉపాధ్యాయులు, విద్యార్థులను రానివ్వకపోవడంతో ఈ విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాఠశాలకు సెలవు ప్రకటించమని ఆయన చెప్పడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఇంటికి పంపించారు. విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు అక్కడికి వచ్చి చనిపోయిన కోతిని బయట వేయించారు.

మద్యం దుకాణంలో చోరీ

సీసీ ఫుటేజ్‌లో నిందితుడు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 9: మూసి ఉన్న మద్యం దుకాణం తాళం పగులగొట్టి నగదుతో పాటు మద్యం సీసాలు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో సోమవారం జరిగింది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గవ్వలపల్లి చౌరస్తాలో ని మెదక్–చేగుంట ప్రధాన రహదారిపై ఉన్న రేణుకామాత మద్యం దుకాణం నిర్వాహకులు ఆదివారం రాత్రి 10 గంటలకు తాళం వేసి వెళ్లి పోయారు. ఉదయం దుకాణం షటర్ తెరిచి, తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు దుండగులు మద్యం దుకాణం తాళం తెరచి అందులోకి ప్రవేశించారు. గల్లా పెట్టెలో ఉంచిన రూ.15వేల నగదు, 20 నుంచి 25 మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. నిత్యం ఈ రహదారి వెంట హైదరాబాద్ మెదక్, బాన్సువాడ, బోధన్‌కు వాహనాలు వెళ్తుంటాయి. రద్దీ రహదారిపై ఉన్న మద్యం దుకాణాన్ని దుండగులు పక్కా ప్రణాళిక ప్రకారం చోరీ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. వినయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వార్డులోని సమస్యలను పరిష్కరించాలి

నర్సాపూర్, సెప్టెంబర్ 9: మున్సిపాలిటీలోని వార్డుల్లో తలెత్తే సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్ అధికారులకు సూచించారు. సోమవారం 9వ వార్డులో వీరు పర్యటించారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టాలన్నారు. వారి వెంట వార్డు అధికారి రణదీప్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, వాటర్ సప్లై సూపర్‌వైజర్ వినీత్ రాజ్, వార్డు అధికారి పరశురాంరెడ్డి, జవాన్ ఎల్లం ఉన్నారు.

పెట్రోలింగ్ చేయాలి

చిలిపిచెడ్, సెప్టెంబర్ 9: చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, ఘటనలపై వివరాలను స్థానిక ఎస్సై యాదగిరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేయాలన్నారు. ఆయన వెంట నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన నాయకులు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 9: పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు నివాసంలో రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్, కొర్విపల్లి మాజీ సర్పంచ్ రంగారావు సోమవారం కలిశారు.

విద్యుత్ షాక్‌తో పారిశుధ్య కార్మికుడు మృతి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 9: గణేశ్ మండపం వద్ద విద్యుదాఘాతంతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన హవేళీఘనపూర్ మండలంలోని రాజ్‌పేటలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌పేట గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా దాసరి పోచయ్య (60) పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం స్థానికంగా ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద శుభ్రం చేస్తున్నాడు. అక్కడ ఏర్పాటు చేసిన జియా వైర్‌ను పక్కన పెట్టేందుకు పట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మధులతకు గురుబ్రహ్మ అవార్డు

చిలిపిచెడ్, సెప్టెంబర్ 9: మండలంలోని చిట్కుల్ కేజీవీబీలో తెలుగు టీచర్‌గా పని చేస్తున్న మధులతకు రాష్ట్ర స్థాయిలో వల్లూరి ఫౌండేషన్ సంస్థ అధికారులు గురుబ్రహ్మ అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం అందజేశారు. గురుబ్రహ్మ అవార్డు దక్కడం గర్వ కారణంగా ఉన్నదని ఆమె తెలిపారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

పాపన్నపేట, సెప్టెంబర్ 9: మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన రమేశ్ దివ్యాంగుడు. రమేశ్‌కు బీఆర్ఎస్ నాయకుడు మల్లేశ్ అండగా నిలిచాడు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలక్ట్రికల్ వెహికల్ రాలేదు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువనాయకుడు మల్లేశ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ట్రై సైకిల్ ఇప్పించాడు. ఎలక్ట్రికల్ స్కూటీ రాగానే దివ్యాంగుడికి ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మల్లేశ్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట, సెప్టెంబర్ 9: మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి యువ నాయకుడు గట్టు ప్రశాంత్ రూ.4వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో చాకలి రామచంద్రం, అశోక్, శ్రీశైలం, యాదగిరి, నారాయణ, జిన్న దిలీప్ ఉన్నారు.

కారు, బైక్ ఢీ ఒకరు మృతి

గణేశ్ (ఫైల్)

పాపన్నపేట సెప్టెంబర్ 9: కారు బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లాపూర్ శివారులో జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. హవేళీఘనపూర్ మండలంలోని చౌట్లపల్లి గ్రామానికి చెందిన చీమల గణేశ్ (28) ప్రైవేట్ బ్యాంకులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో ఏడుపాయల కమాన్ వైపు నుంచి మెదక్ వెళ్తున్న కారు ఎల్లాపూర్ శివారులో ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స కోసం మెదక్ ఏరియా దవాఖానకు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఝాన్సీలింగాపూర్ పెద్ద చెరువుకు బుంగ

బుంగను జేసీబీతో పూడుస్తున్న అధికారులు

రామాయంపేట, సెప్టెంబర్ 9: మండలంలోని ఝాన్సీలింగాపూర్ పెద్ద చెరువుకు సోమవారం గండి పడింది. విషయం తెలుసుకున్న రామాయంపేట రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏఈ కుశాల్, గ్రామ కార్యదర్శి పద్మ, రైతులు జేసీబీలు, ట్రాక్టర్లతో మట్టిని తీసుకొచ్చి పూడ్చేశారు. వారం రోజుల క్రితం ఇదే చెరువుకు బుంగపడి చెరువులో నీరు భారీగా బయటకు వెళ్లిపోయింది. మళ్లీ చెరువుకు బుంగ పడడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుంగలతో చెరువులోని నీళ్లు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

సీసీ రోడ్డుపై వర్షపు నీరు

చిట్కుల్ వెళ్లే ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చిలిపిచెడ్, సెప్టెంబర్ 9: మండలంలోని చిట్కుల్ గ్రామానికి వెళ్లే ప్రధాన దారి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు నీటితో, బురదమయంగా తయారైంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై నిలిచిన నీటికి అడ్డుకట్టు వేసున్నారు. దీనిపై గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని గ్రామ కార్యదర్శి తిరుపతి తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

రామాయంపేట, సెప్టెంబర్ 9: సమస్యల పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రజినీకుమారి అన్నారు. తహసీల్ కార్యాలయంలో దరఖాస్తులను ఆమె స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేమె యాదగిరి, అధికారులు ఉన్నారు.

ఆరోగ్యానికి ఆర్‌బీఎస్‌కే భరోసా

నిజాంపేట, సెప్టెంబర్ 9: విద్యార్థుల ఆరోగ్యానికి ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) భరోసా కల్పిస్తుందని డాక్టర్ సిద్ధిరాములు తెలిపారు. సోమవారం నిజాంపేటలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్ఞానమాల, డాక్టర్ సంతోష, వైద్య సిబ్బంది మోహన్, జయంతి, ఆశవర్కర్లు లక్ష్మి, అనిత, బాలమణి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16 K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640258899 / 9640468899.
NT-331758-All

కావలెను

★ సిద్దిపేట జిల్లాలో అన్ని మండలాలకు భారత్‌పే & భారత్ సి.సి.ఎస్. సాఫ్ట్‌వేర్ సేవలు నిర్వహించడానికి యువతీ/యువకులు కావలెను. ఉచిత ట్రైనింగ్, Age: 18-50 సం॥లు. సంప్ర॥ 8866324466.
NTK-00000

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

MNR PG COLLEGE
Opp : JNTU, Near HMT Hills, Kukatpally, Hyd - 85.
VERY FEW SEATS UNDER MANAGEMENT QUOTA ARE AVAILABLE
M.Sc. Organic Chemistry,